రూ.60 లక్షలతో కర్మల భవనం నిర్మాణం

త్వరలో ప్రారంభానికి సన్నాహాలు

రామవరప్పాడు: నగరానికి ఆనుకుని ఉన్న మేజర్ పంచాయతీ రామవరప్పాడు. ప్రధాన గ్రామంతో పాటు కాల్వగట్టు ప్రాంతాల్లో కలిపి సుమారు 30 వేలకు మందికి పైగా జనాభా నివసిస్తున్నారు. కాని ఎన్నో సంవత్సరాల నుంచి ఈ గ్రామంలో కర్మల భవనం లేకపోవడంతో కర్మకాండలు నిర్వహించుకునేందుకు గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఇబ్బందులను గ్రామ సర్పంచ్ వరి శ్రీదేవి ద్వారా తెలుసుకున్న ఓ దాత స్పందించారు. గ్రామానికి చెందిన కోడెబోయిన రాధాకృష్ణ జ్ఞాపకార్థం వారి కుమారుడు కోడెబోయిన శ్రీనివాసకృష్ణ సుమారు రూ.60 లక్షలు వెచ్చించి కర్మల భవనం నిర్మించేందుకు ముందుకొచ్చారు. దాత ముందుకు రావడంతో సర్పంచ్ శ్రీదేవి గ్రామస్తులకు అందుబాటులో ఉండే విధంగా రైవస్ కాలువ వంతెన సమీపంలో కర్మల భవనం నిర్మాణానికి 12 సెంట్లు కేటాయించారు. ఈ స్థలంలో కర్మల భవన నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. ఇప్పటికే నిర్మాణ పనులు దాదాపుగా పూర్తి కావచ్చాయి. ఈ నెల చివరలో ఈ భవనాన్ని ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నారు.



సకల సౌకర్యాలతో రూపుదిద్దుకుంటున్న కర్మల భవనం

అత్యాధునిక సౌకర్యాలతో..

కర్మల భవనంలో విశాలవంతమైన హాలు, భోజనశాల, పిండ ప్రదానం నిర్వహించుకునేందుకు వీలుగా సౌకర్యాలు, స్త్రీలకు, పురుషులకు వేరు వేరుగా మరుగుదొడ్లు నిర్మాణం చేశారు. కార్పొరేట్ ఫంక్షన్ హాల్స్‌కు ఏ మాత్రం తీసిపోని రీతిలో ఫ్లోరింగ్ టైల్స్, ఎంట్రన్స్‌లో గ్లాస్ ఫిటింగ్, ఐరన్ గేట్లు, అత్యాధునిక సీలింగ్, ఎలక్ట్రికల్, పెయింట్ వర్క్స్‌తో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. మరో రెండు వారాల్లో నిర్మాణ పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురానున్నారు.

గ్రామానికి మంచి చేయాలన్న ఆలోచన తోనే...



పుట్టి పెరిగిన గ్రామంపై ఉన్న మమకారంతో గ్రామానికి మంచి చేయాలన్న ఆలోచనతో కర్మల భవన నిర్మాణానికి ముందు కొచ్చాను. నిర్మాణ పనుల్లో రాజీ పడకుండా సుమారు రూ.60 లక్షలు సొంత నిధులు వెచ్చించాం.

– దాత కోడెబోయిన శ్రీనివాసకృష్ణ

అతి త్వరలో అందుబాటులోకి...



సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకుంటున్న కర్మల భవనం అతి త్వరలో ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నాం. అడిగిన వెంటనే దాత శ్రీనివాస కృష్ణ ముందుకొచ్చి ఖర్చుకు వెనుకాడకుండా నిర్మించడం అభినందనీయం.

– వరి శ్రీదేవి, గ్రామ సర్పంచ్, రామవరప్పాడు

కేసరపల్లి 1వ వార్డు రీకౌంటింగ్‌లో శ్రీధర్‌బాబు విజయం



శ్రీధర్‌బాబుకు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న రిటర్నింగ్ అధికారి నరసింహారావు

గన్నవరం: మండలంలోని కేసరపల్లి గ్రామ పంచాయతీ 1వ వార్డుకు న్యాయస్థానం ఆదేశాల మేరకు శుక్రవారం జరిగిన రీకౌంటింగ్‌లో జాస్తి శ్రీధర్‌బాబు ఏడు ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య రీకౌంటింగ్ ప్రక్రియను అధికారులు నిర్వహించారు. 2021 ఫిబ్రవరి 21న జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో 1వ వార్డులో జాస్తి శ్రీధర్‌బాబుపై మూల్పూరి మాధవన్ రెండు ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. అయితే కౌంటింగ్ సక్రమంగా జరగలేదని శ్రీధర్‌బాబు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టును ఆశ్రయించగా జడ్జి రీకౌంటింగ్‌కు ఆదేశించారు. ఈ తీర్పుపై స్టేటస్‌కో కోసం మాధవన్ వేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. దీంతో గుడివాడ ఆర్డీఓ పద్మావతి పర్యవేక్షణలో రిటర్నింగ్ అధికారి, తహసీల్దారు సీహెచ్ నరసింహారావు కోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా రీకౌంటింగ్ చేపట్టారు. బ్యాలెట్ పత్రాలను క్షుణంగా పరిశీలించిన తర్వాత జాస్తి శ్రీధర్‌బాబుకు 213 ఓట్లు, మూల్పూరు మాధవన్‌కు 206 ఓట్లు వచ్చినట్లుగా ప్రకటించారు. శ్రీధర్‌బాబు విజయం సాధించినట్లుగా ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో సంపత్‌కుమారి, ఎంపీడీవో సత్యకుమార్, ఈఓపీఆర్డీ వెంకటేశ్వరమ్మ, సూపరింటెండెంట్ ప్రసాద్ పాల్గొన్నారు. కౌంటింగ్ కేంద్రం వద్ద అలజడి సృష్టించినందుకు మాధవన్‌తో పాటు అతని సోదరుడు ఎంవీఎల్ ప్రసాద్‌ను ఆర్డీఓ ఆదేశాల మేరకు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. నిష్పక్షపాతంగా రీకౌంటింగ్ ప్రక్రియ నిర్వహించిన అధికారులకు మాజీ ఏఎంసీ చైర్మన్ పొట్లూరి బసవరావు కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం కేసరపల్లిలో సంబరాలు జరుపుకొన్నారు. శ్రీధర్‌బాబును సర్పంచి చేబ్రోలు లక్ష్మీ మౌనిక, పలువురు వార్డు సభ్యులు సత్కరించారు.

కానూరు పాఠశాలను తనిఖీ చేసిన డీఈఓ



కానూరులో మధ్యాహ్న భోజనం చేస్తున్న డీఈఓ తాహెరా సుల్తానా

పెనమలూరు: కానూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాశాఖ అధికారి తాహెరా సుల్తానా శుక్రవారం తనిఖీ చేశారు. ఆమె పాఠశాలలో జరుగుతున్న పరీక్షలు పరిశీలించారు. అనంతరం జగనన్న గోరుముద్ద అమలు తీరును విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ మెనూ ప్రకారం జగనన్న గోరుముద్ద అమలు జరుగుతుందా లేదా అని పరిశీలించారు. అనంతరం ఆమె విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం మధ్యాహ్నం భోజన పథకం పట్ల విద్యార్థులు, తల్లిదండ్రులు సంతృప్తికరంగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ కనక మహాలక్ష్మి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వంశీకి రైతుల కృతజ్ఞతలు

రైతులకు 60 సాగునీటి మోటార్లు అందజేత



రామన్నగూడెంలో ఎమ్మెల్యే వంశీ అందజేసిన మోటార్లతో పంటకు నీరు పెట్టుకుంటున్న రైతులు

గన్నవరంరూరల్: తమ కష్టాలను గమనించి తమకు సరైన సమయంలో నీటి మోటార్లు అందజేసిన ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్‌కు రైతులు కృతజ్ఞతలు తెలిపారు. వర్షాభావ పరిస్థితులు ప్రస్తుతం వరి పంటకు ఇబ్బందిగా మారి, సాగునీరు అందక పంట వడబడి పోతోందని రైతులు ఆందోళన చెందుతున్న దశలో రైతుల విజ్ఞప్తి మేరకు ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ వారికి నీటి మోటార్లు అందించి ఆదుకున్నారు. గడిచిన నెల రోజులుగా వర్షాలు లేకపోవటం, ఎండ తీవ్రంగా ఉండటంతో వరి మాగాణుల్లో నీరు తగ్గింది. నియోజకవర్గంలోని ఉంగుటూరు, బాపులపాడు మండలాల్లో వరి సాగు ఎక్కువగా జరుగుతోంది. ఈ పరిస్థితుల్లో పలు గ్రామాల రైతులు ఎమ్మెల్యేను కలసి పరిస్థితిని వివరించారు. తక్షణం స్పందించిన ఆయన సాగునీటి మోటార్లను ఆయా గ్రామాలకు పంపారు. బాపులపాడు మండలం రామన్నగూడెం, కాకులపాడు, కానుమోలు, కె.సీతారాంపురం, ఆరుగొలను, బొమ్ములూరు, బండారుగూడెం, ఉంగుటూరు మండలం పెద అవుటపల్లి, ఆముదాలపల్లి తదితర గ్రామాల రైతులకు వంశీ మొత్తం 60 సాగునీటి మోటార్లు అందజేశారు. దీంతో రైతులు ఆయనకు కృతజ్ఞతలు తెలుపుతోంది. బొమ్ములూరు ఎంపీటీసీ సభ్యురాలు కుందేటి శిరీష మాట్లాడుతూ కష్టకాలంలో రైతులకు అండగా నిలిచిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. రామన్నగూడెం సర్పంచ్ రెడ్డి వీరాంజనేయులు మాట్లాడుతూ రైతుల ఇబ్బంది వివరించగానే స్పందించి 6 అంగుళాల హైస్పీడు కలిగిన 5 కొత్త మోటార్లు అందించారని, వాటికి సరిపడా కొత్త సామాన్లు, ట్రాన్స్‌ఫార్మర్ సైతం అందజేశారని చెప్పారు. దీంతో గత ఏడు రోజులుగా వరి పంటకు నీళ్లు అందించుకోగలుగుతున్నామని వివరించారు.

నున్న హైస్కూల్లో సామర్థ్య సర్వే పరీక్షలు

నున్న(విజయవాడరూరల్): కేంద్ర ప్రభుత్వం జాతీయ స్థాయిలో నిర్వహించిన సామర్థ్య సర్వే పరీక్షలు శుక్రవారం నున్న జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహించారు. ఇంగ్లిషు, లెక్కలు సబ్జెక్టులకు సంబంధించిన ఈ పరీక్షలకు 9 తరగతి విద్యార్థులు 30 మంది, 6వ తరగతి విద్యార్థులు 30 మంది హాజరైనట్టు హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు వి.భూపాల్‌రెడ్డి తెలియజేశారు.

టైక్వాండోలో బంగారు పతకాలు సాధించిన విద్యార్థినులు



బంగారు పతకాలు పొందిన విద్యార్థినులు యజ్ఞ, లిఖిత

పెనమలూరు: ఉమ్మడి కృష్ణాజిల్లా టైక్వాండో పోటీల్లో పోరంకి గ్రీన్ స్కూల్ విద్యార్థులు బంగారు పతకాలు సాధించినట్టు పాఠశాల ప్రిన్సిపాల్ అపర్ణ తెలిపారు. గ్రీన్ స్కూల్‌కు చెందిన యజ్ఞ, లిఖిత విజయవాడలో ఈ నెల 2వ తేదీన జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో సత్తా చాటి బంగారు పతకాలు సాధించి, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని చెప్పారు. ఈ సందర్భంగా వారిరువురిని పాఠశాల చైర్మన్ వీరమాచినేని వంశీకృష్ణ, ఉపాధ్యాయులు, సహ విద్యార్థులు అభినందించారు.

ఫుట్‌పాత్‌లపై ఆక్రమణల తొలగింపు

రామవరప్పాడు: ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు నుంచి గూడవల్లి వరకు ఫుట్‌పాత్‌లపై చోటు చేసుకున్న ఆక్రమణలను తొలగించడానికి అధికారులు శుక్రవారం చర్యలు తీసుకున్నారు. డీపీఓ జయచంద్ర గాంధీ ఆధ్వర్యంలో వీఎంసీ, పంచాయతీ అధికారులతో కలిసి రామవరప్పాడు, ప్రసాదంపాడు జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న ఫుట్‌పాత్‌లపై గుర్తించిన ఆక్రమణలను పోలీసుల సమక్షంలో తొలగించారు. ఈ సందర్భంగా డీపీఓ జయచంద్ర మాట్లాడుతూ వారం రోజుల క్రితం అధికారులతో కలిసి ఆక్రమణలను పరిశీలించి 120 మందికి పైగా నోటీసులు జారీ చేశామని తెలిపారు. రామవరప్పాడు నుంచి గూడవల్లి వరకు మూడు రోజుల పాటు ఆక్రమణల తొలగింపు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. తిరిగి ఆక్రమించకుండా ఉండేందుకు ఆయా ప్రాంతాల్లో మహిళా పోలీసులతో పర్యవేక్షించనున్నట్లు వివరించారు.

క్లుప్తంగా

నేడు పోరంకిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: పోరంకిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈఈ పి.హరిబాబు తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామన్నారు. ఈ కారణంగా బందరు రోడ్డు, సాయినగర్, క్యాపిటల్ ఆస్పత్రి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, గ్రామస్తులు సహకరించాలని కోరారు.

నేడు ఓటర్ల నమోదు కార్యక్రమం

పెనమలూరు: భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు శని, ఆదివారాల్లో ఓట్ల నమోదుకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నామని తహసీల్దార్ కట్టా వెంకటశివయ్య తెలిపారు. నియోజకవర్గంలో ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద బూత్ లెవల్ అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఓటర్ల జాబితాలో ఓట్లు నమోదు, మార్పులకు బీఎల్‌వోలను సంప్రదించాలని సూచించారు.

గన్నవరంలో...

గన్నవరం: నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లోని 306 పోలింగ్ కేంద్రాల్లో ఈ నెల 4, 5 తేదీల్లో ఓటర్ల నమోదు, చేర్పులు, మార్పులు నిర్వహించనున్నట్లు నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి బి.చంద్రలీల శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రెండు రోజులు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ కేంద్రాల వద్ద బూత్ స్థాయి అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. ఈ అవకాశాన్ని ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

నేడు రామవరప్పాడులో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం

రామవరప్పాడు: రామవరప్పాడు సచివాలయం-3 పరిధిలో శనివారం జెడ్పీ పాఠశాల ఆవరణలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి ఘంటా రామ్మోహనరావు తెలిపారు. గ్రామస్తులు ఈ శిబిరాన్ని సద్వినియోగపరుచుకోవాలని సూచించారు.

అయ్యప్ప మాలధారులకు అన్నదానం ప్రారంభం

గన్నవరంరూరల్: మండలంలోని బీబీగూడెం గ్రామంలో అయ్యప్ప మాలధారులకు అన్నదాన కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైంది. గురుస్వామి గుజ్జర్లపూడి శ్రీనివాస్ పర్యవేక్షణలో దాత రాజేష్ ఈ కార్యక్రమం ప్రారంభించారు. డిసెంబరు 13వ తేదీ వరకూ ప్రతిరోజూ అన్నదానం జరుగుతుందని రాజేష్ తెలిపారు.

మామిడిలో సస్యరక్షణ సదస్సు

గన్నవరంరూరల్: మండలంలోని సూరంపల్లి ఆర్‌బీకే వద్ద శుక్రవారం మామిడిలో సస్యరక్షణ చర్యలపై రైతులకు సదస్సు జరిగింది. మండల హార్టీకల్చర్ అధికారి హరిచంద్ మాట్లాడుతూ మామిడితోటల్లో నీటి తడులు ఆపాలని చెప్పారు. తేనె మంచు పురుగు ఉధృతి ఉంటే ఇమిడక్లొప్రిడ్ 3 ఎంఎల్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. మసి తెగులు నివారణకు చర్యలు సూచించారు. వై.శరత్ బాబు, శ్యాం, హెచ్‌వో దీక్ష పాల్గొన్నారు.

మాదలవారిగూడెంలో డ్రైడే ర్యాలీ

గన్నవరంరూరల్: మండలంలోని మాదలవారిగూడెం గ్రామంలో శుక్రవారం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో డ్రైడే కార్యక్రమం జరిగింది. ఏఎన్ఎం మేరీగ్రేస్, వైద్య సిబ్బంది గ్రామంలో మురుగు కాలువల పూడికలు తీయించారు. గ్రామస్తులతో ర్యాలీ నిర్వహించారు.

పోలీసుల యూనిఫాంకు పుట్టగుంట విరాళం



విరాళాన్ని అందిస్తున్న పుట్టగుంట సతీష్‌కుమార్

హనుమాన్‌జంక్షన్‌రూరల్: హనుమాన్‌జంక్షన్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న 40 మంది పోలీస్ సిబ్బందికి ప్రముఖ పారిశ్రామికవేత్త, పుట్టగుంట హెల్త్ ఫౌండేషన్ చైర్మన్ పుట్టగుంట సతీష్‌కుమార్ ఉచితంగా యూనిఫాం పంపిణీ చేశారు. పోలీస్ యూనిఫాంకు అయ్యే మొత్తాన్ని ఆయన శుక్రవారం తన కార్యాలయంలో హనుమాన్‌జంక్షన్ సీఐ అల్లు నవీన్ నరసింహమూర్తికి అందించారు.

సంక్షిప్తం

చెరకు రైతుల సంక్షేమానికి కృషి చేస్తా



రాజులపాటిని సత్కరిస్తున్న గౌడ సంఘ ప్రతినిధులు

ఉయ్యూరు: చెరకు రైతుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తానని సీడీసీ నూతన చైర్మన్ రాజులపాటి రామచంద్రరావు అన్నారు. సీడీసీ చైర్మన్‌గా నియమితులైన రామచంద్రరావును ఆయన కార్యాలయంలో శుక్రవారం గౌడ సంఘ ప్రతినిధులు, పార్టీ నాయకులు, రైతులు పలువురు ప్రజాప్రతినిధులు కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా రాజులపాటి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి చైర్మన్‌గా నియమించిన సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కొలుసు పార్థసారథి, కైలే అనిల్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

అవినీతి రహిత సమాజాన్ని స్థాపించాలి

పెనమలూరు: అవినీతి రహిత సమాజాన్ని స్థాపించాలని, దీనికి విద్యార్థులు తమ వంతు కృషి చేయాలని పెనమలూరు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖ మేనేజర్ బి.మేఘనాథ్ అన్నారు. బ్యాంకు విజిలెన్స్ వారోత్సవాలలో భాగంగా పెనమలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం అవినీతి నిర్మూలన–దేశ ప్రగతి అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అవినీతి రహిత సమాజం నెలకొల్పుతామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో హెచ్ఎం వై.దుర్గాభవాని, ఫీల్డ్ ఆఫీసర్ తేజ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోస్టల్ ఇన్‌స్పెక్టర్ రెడ్డంకయ్య సేవలు ప్రశంసనీయం

పమిడిముక్కల: ఉయ్యూరు సబ్ డివిజన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ ఉప్పాల రెడ్డంకయ్య సేవలు ప్రశంసనీయమని పోస్టల్ ఉద్యోగులు కొనియాడారు. ఇన్‌స్పెక్టర్‌గా ఇక్కడ మూడేళ్లు పనిచేసి బదిలీపై విజయవాడ రీజనల్ ఆఫీసుకు వెళుతున్న నేపథ్యంలో శుక్రవారం ఐపీఓ కార్యాలయంలో వీడ్కోలు సభ నిర్వహించి ఘనంగా సత్కరించారు. ఎస్‌పీఎం రాంబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంఓలు నాగలక్ష్మి, జగన్మోహనరావు, ఎస్‌పీఎంలు, పోస్టల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

దోమల నిర్మూలనకు ప్రత్యేక చర్యలు

కంకిపాడు: దోమల నిర్మూలనకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి జి.శ్రీనివాసరావు సూచించారు. ఫ్రైడే డ్రైడేలో భాగంగా ఉప్పలూరు పీహెచ్‌సీ పేరిధిలోని కంకిపాడు గ్రామంలో శుక్రవారం దోమల నిర్మూలనకు మందు పిచికారీ చేయించారు. ఈ పనులను సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

నేడు లక్ష్మీగణపతి స్వామి విగ్రహ ప్రతిష్ట

కంకిపాడు: కంకిపాడు పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆర్యవైశ్య ప్రార్థనామందిరంలో శుక్రవారం నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. శ్రీ లక్ష్మీగణపతి స్వామి విగ్రహ ప్రతిష్టా మహోత్సవాలను పురస్కరించుకుని గోపూజ, గణపతి పూజ, ప్రత్యేక పూజలు జరిపించారు. ఈనెల 4వ తేదీన శ్రీ లక్ష్మీ గణపతి స్వామి వారి విగ్రహ ప్రతిష్ట, హోమం, పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. పూజా కార్యక్రమాలను ఆర్యవైశ్య ప్రార్థనామందిరం కమిటీ ప్రతినిధులు పర్యవేక్షించారు.

రాష్ట్ర స్థాయి క్రీడలకు ఈడుపుగల్లు విద్యార్థుల ఎంపిక



ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈఓ ప్రసాద్

కంకిపాడు: రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఈడుపుగల్లు జెడ్పీ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను ఎంఈఓ ప్రసాద్, హెచ్ఎం పద్మావతిబాయి శుక్రవారం ప్రత్యేకంగా అభినందించారు. వారు మాట్లాడుతూ ఈనెల 1న గుడివాడ ఎన్టీఆర్ స్టేడియంలో జరిగిన స్కూల్ గేమ్స్ జిల్లా స్థాయి పోటీల్లో అథ్లెటిక్స్ విభాగంలో అండర్–17 లో ఎం.మంగ 200, 100 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానం, ఎస్.దీప్తి మాధురి లాంగ్ జంప్‌లో ప్రథమస్థానం, 100 మీటర్ల హర్డిల్స్‌లో రెండో స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారన్నారు. శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు దుర్గాభవాని, రామయ్యలను అభినందించారు.

10 నుంచి చెకుముకి సైన్స్ సంబరాలు

గన్నవరంరూరల్: చెకుముకి సైన్స్ సంబరాలు–2023 పోస్టర్‌ను శుక్రవారం స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జేవీవీ ప్రతినిధి షేక్ ఇమాం మాట్లాడుతూ నవంబరు 10న పాఠశాల స్థాయి, 30న 2వ దశ, డిసెంబరు 17న 3వ దశ అనంతరం జనవరి 27, 28 తేదీల్లో రాష్ట్ర స్థాయి సంబరాలు జరుగుతాయన్నారు. వివరాలకు 7799985786 నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం ఎంవీ సుబ్బారావు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాలు పునర్నిర్మించాలని వినతి

గన్నవరం: స్థానిక ఎస్సీ కాలనీలోని అంబేడ్కర్ పార్కులో ఉన్న కమ్యూనిటీ హాలు పునర్నిర్మాణం చేయాలని ఎంపీపీ అనగాని రవికి కాలనీవాసులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీని కలిసిన ఎంపీటీసీ సభ్యులు తిరివీధి రవి, ఎంఈఎఫ్ అధ్యక్షుడు బొక్కినాల కోటేశ్వరరావు వినతిపత్రం సమర్పించారు.

ప్రతి కుటుంబానికి వంద రోజుల పనిదినాలు

ఉంగుటూరు: ప్రతి కుటుంబానికీ ఉపాధి హామీ పథకం ద్వారా 100 రోజుల పని కల్పించాలని ఎంపీడీవో శేషగిరిరావు అన్నారు. మండలంలో ఆముదాలపల్లి, ఆత్కూరు, కొయ్యగూరపాడు, గారపాడు గ్రామాల్లో శుక్రవారం ఉపాధి హామీ పథకం ద్వారా పనుల గుర్తింపు గ్రామ సభలు నిర్వహించి 187 పనులు గుర్తించారు. వీటితో సుమారు 47 వేల పనిదినాలు లభిస్తాయని ఎంపీడీఓ తెలిపారు.

విద్యార్థుల్లో జీవన నైపుణ్యాలను పెంపొందించాలి

హనుమాన్‌జంక్షన్ రూరల్: విద్యార్థి దశలో వ్యవస్థాపక మనస్తత్వాన్ని అభివృద్ధి చేసేందుకు తగిన జీవన నైపుణ్యాలను పెంపొందించాలని ఈఎండీపీ జిల్లా మేనేజర్ జంపన భానుకిరణ్ అన్నారు. బాపులపాడు మండలం కానుమోలులోని జెడ్పీ హైస్కూల్‌ను శుక్రవారం ఆయన సందర్శించారు. విద్యార్థులను భావి పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం 9వ తరగతి విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ప్రవేశపెట్టిన ఎంట్రప్రెన్యూరియల్ మైండ్‌సెట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (ఈఎండీపీ) అమలుతీరును ఆయన పరిశీలించారు. పాఠశాలలోని 9వ తరగతి విద్యార్థులతో ఆయన కొద్దిసేపు ముచ్చటించి, ఈఎండీపీ కార్యక్రమాలపై అభిప్రాయాలను సేకరించారు. హెచ్ఎం ఎస్.పద్మజ పాల్గొన్నారు.

జేఏఎస్ శిబిరాల్లో కార్పొరేట్ స్థాయి సేవలు



జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో మాట్లాడుతున్న డాక్టర్ మాధవి

నున్న(విజయవాడరూరల్): రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల ద్వారా కార్పొరేట్ స్థాయి వైద్యసేవలు అందిస్తోందని వెలగలేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మాధవి అన్నారు. నున్న గ్రామంలో ఒకటో నంబరు సచివాలయం పరిధిలోని ప్రజలకు శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వైద్యాధికారి మాధవి మాట్లాడుతూ వైద్యశిబిరం ద్వారా అనేక వ్యాధులకు వైద్యపరీక్షలు నిర్వహించి చికిత్సలు అందజేశారన్నారు. వైఎస్సార్‌సీపీ గ్రామ కన్వీనర్ పోలారెడ్డి చంద్రారెడ్డి మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో మళ్లీ సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ యర్కారెడ్డి నాగిరెడ్డి, ఉపసర్పంచి కలకోటి బ్రహ్మనందరెడ్డి, సొసైటీ డైరెక్టర్ ముత్తారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఖరీఫ్ పంట కొనుగోలుకు ఏర్పాట్లు చేయాలి



మాట్లాడుతున్న గ్రామ వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మంచినేని పరమేష్

పెనమలూరు: రానున్న ఖరీఫ్ పంట విక్రయానికి రైతులకు తగిన ఏర్పాట్లు చేయాలని పోరంకి సొసైటీ అధ్యక్షుడు, గ్రామ వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మంచినేని పరమేష్ అన్నారు. పోరంకి సొసైటీలో శుక్రవారం జరిగిన సలహామండలి సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని అన్నారు. సమావేశంలో మండల వ్యవసాయాధికారి కనకమేడల శైలజ, వీఏఏ స్టెల్లీ, రైతులు పాల్గొన్నారు.